

# సహవాసం

— భమిడిపాటి రామగోపాలమ్

రెండు గోపాల్ జర్దా కిళ్ళీలు !" అన్నాను, రెండు రూపాయల నోటు అందించి.

కుర్రాడు ముగుతూ ముగుతూ వున్న అరటిపండులా వున్నాడు. "అయ్" అని వినయంగా అందుకుంటూ "బంగాలీ ఆకే గదండి ?" అన్నాడు.

"ఆ ! ఖిమాం చిట్టంగా తగిలించు."

"అలాగే సార్."

"ముందొక సోడా కొట్టు ?" అని ఆజ్ఞాపించేను.

"యస్సార్."

సోడా పు...చ్చుకుంటూ "ఈ అరిటి పండెంత ?" అన్నాను.

"ముప్పయ్యయిదు పైసలండి సార్".

"అబ్బా! యేమిటంత గిరాకి? చక్కెర కేళీ రేటు చెబుతున్నావ్ ?"

"చిత్తం సార్. రాయిమండ్రి సరుకండి. చక్కెర కేళీ కాదుగానండి. అమృతపాణీ అంటారండి." అని సున్నం బ్రష్ అంటించిన తెుపుు చేతినుంచి తుడుచుకుంటూ చెప్పాడు. తనే ఒక పండు ఎంపిక చేసి కత్తితో గెలనుంచి కోసి అరటిపండు వొలిచి చేతిలో పెట్టినంత పనిచేసేడు. "చక్కెర కేళీ దీనిముందు ఎందుకు పనిచేస్తదండి? ఊరికే దూరపు కొండలు నునుపంతే. తమరు భోంచేసి చూడండండి. నచ్చకపోతే పూరికే ఇచ్చేస్తానండి" అన్నాడు. మళ్ళీ కిళ్ళీకట్టే కార్యక్రమంలో పడ్డాడు. మొగాన చిరునవ్వు వదలకుండాను.

పండు తిన్నందుకాదు. అతగాడి ప్రవర్తనకీ ప్రసన్నతకీ ఇవ్వచ్చు నలభై పైసలు- అనిపించింది.

రాత్రి పదిన్నర కావస్తోంది. మేం వుండే 'కాలనీ'లో కిళ్ళీ దుకాణాలుండవు. ఈ వేళప్పుడు ఒకవేళ ఉన్నా అక్కడ నాక్కావల్సిన జర్దా వుండదు. 'గోపాల్ జర్దా' అన్నానా అది లేద్ సార్ బాబాజర్దా వుంది కట్టమంటారా ?" అంటాడు. లేకపోతే 'బంగాలీ ఆకులేద్సార్ ' అంటాడు. అదీ కాకపోతే ఏలక్కాయ లేదనో, పిప్పరమెంటు పువ్వు లేదనో కండిషన్ పెడ్తాడు. రో.. అందుకని టౌన్‌లోంచే పట్టుకెడతాను కిళ్ళీలు. మా రామారావు మాస్టారూ అంతే. యాభై చదరపు మైళ్ళ సిటీ మొత్తంమీద ఆయన కావలసిన కిళ్ళీ




ఆయన కావలసిన విధంగా కట్టేది ఒక్కదుకాణమే. ఆయన స్వయంగా అంత దూరం (కనీసం నాలుగు కిలోమీటర్లు) సైకిలుమీద వెళ్ళి తెచ్చుకుంటారు. ఓసారి ఆయనకి కొంచెం ఆయాసంగా వుండి స్వయంగా వెళ్ళలేని పరిస్థితొచ్చిందిట. కొడుకులు ముగ్గురూ మూడు పన్లమీద వుండిపోయారుట. ఆయనకేమో ఆ 'స్పెసిఫికేషన్స్' ప్రకారం కిళ్ళీలు వుంటేనేగాని తోచదని యెరిగిన వారైవారి ఇల్లాలే స్వయంగా కొంతదూరం సిటీ బస్‌కి నడిచి బస్సుకోసం నిలబడి బస్సు లోపలా నిలబడి అంతదూరమూ వెళ్ళి మాస్టారి కిళ్ళీలు కట్టించుకుని గంటన్నర శ్రమ చేసుకుని వచ్చారట.

"మేష్టారు మంచుకొట్టుడు. మనకి అరవై రూపాయల విస్కీ బాటిల్‌తోగానీ రానిది ఆయనకి అరవై పైసల జర్దా కిళ్ళీతో వస్తుంది కిక్కు. అదే ఆయనతో చిక్కు" అని మాస్టారు శిష్యులూ మా సహోధ్యాయులూ కొందరనడం యెరుగుదును.

"అయ్"తో మొదలెట్టాడు కుర్రాడు. యస్సార్ అన్నాడు. అలాగే సార్ అన్నాడు. చిత్తం అన్నాడు. ఐదుపైసలు తగ్గిస్తాడేమో అని బేరం ఆడబోయాను. పండు బాగులేకపోతే డబ్బులే ఇయ్యొద్దన్నాడు. కాస్త మోతాదు మించితే ధూర్త లక్షణం అయిపోయేటంత అతి వినయం ప్రదర్శించి నన్ను వశపర్చుకున్నాడు.

"అందులో వో కిళ్ళీ ఇటిచ్చి మళ్ళీ మరోటి కట్టు" అన్నాను; రెండు రూపాయల నోటు ఇచ్చినదానికి బేరం సరిపెట్టేస్తూ

"ఎస్సార్" అన్నాడు కుర్రాడు; చెప్పినట్టు చేస్తూ.

"చదువుకున్నావా?" అన్నాను.

"ఏదోలెండి సార్. బి.కాం. మూడో యేడాది వరకు చదివి మానేశానండి"

"మరెక్కడయినా వుద్యోగం కోసం ప్రయత్నించలేకపోయావా?" అన్నాను.

"మా మామయ్యొద్దన్నాడండి."

"మీ మామయ్యేం చేస్తున్నాడు?" అన్నాను. "అతనూ వ్యాపారమే చేస్తున్నాడా?"

"అయ్."

నా ప్రశ్నకి మరో జవాబులాగా; పక్కనుంచి వో వ్యక్తి దూకుడుగా వచ్చి "ఏరా ఇంకా మూసెయ్యలా; కొట్టు? పోలీసోళ్ళు. చూశారంటే సంపుతారారే." అన్నాడు.

"ఇడిగో అయిపోయింది మావయ్యా. ఇదే చివరి బేరం!" అని కిళ్ళీలు ముడిచేసి "రెండూ కాగితానికి కట్టేనండి సార్." అన్నాడు కుర్రాడు.

ఒచ్చిన వ్యక్తి నన్ను పరిశీలనగా చూసి "నమస్కారం గురువుగారు శాన్నాళ్ళకి" అన్నాడు.

"మీరు—?" అన్నాను.

"గుర్తు పట్లేదేంటండి? నేను కిష్టమూర్తినండి. నా చేత కిళ్ళీకొట్టెట్టించింది మీరేనండి." అని నవ్వుతూ, నా చేతిని వెతిగి పట్టుకుని వూపాడు.

తొమ్మిదేళ్ళకిందట—

బి.కామ్. సెకండ్ క్లాస్‌లో పాసయ్యాను సార్. ఎంప్లాయ్‌మెంటు ఎక్స్చెంజిలో రిజిష్టర్ చేసి నాలుగేళ్ళయింది సార్. నా కొచ్చిన మొట్టమొదటి కాల్ లెటర్ తమరు పన్చేసే ఆఫీస్ నుండే వచ్చింది సార్. ఎకౌంట్స్ క్లర్క్ కమ్ టైపిస్ట్ పోస్టులు సార్. నాలుగు కాళీలంట సార్. ఇరవై ఆరుమందిని పంపుతున్నారు సార్. తమలాంటి వారు కలగజేసుకుంటేగానీ రాదు సార్." అంటూ మూడు రోజులపాటు ఎడా తెరిపిలేకుండా నన్ను ఆశ్రయించాడు.

ఈ క్రిష్ణమూర్తి!

అప్పటికీ యిప్పటికీ ఆ ఆఫీస్‌లో ఎస్టాబ్లిష్‌మెంటు సెక్షన్ సూపరింటెండెంట్ నేనే. మధ్యలో ఒకసారి ట్రాన్స్‌ఫర్ అయ్యానుగాని మళ్ళీ పలుకుబడి వుపయోగించుకుని యిక్కడికే చేరాను.

సరే, మర్నాడు ఫైల్ తిరగేసి చూశాను. ఇంటర్వ్యూ ఇంకా మూడు రోజులుంది. ఎకౌంట్స్ ఆఫీసర్ బ్రహ్మాజీరావుగారు; డెప్యూటీ సెక్రెటరీ అనంతశయనంగారు; పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ కొండయ్యగారూ ఆ ఇంటర్వ్యూ చేస్తారు. బ్రహ్మాజీరావు గారికి నా మాటంటే గురి కదా; పోనీ నేనున్న వీథిలోనే వుంటున్నాడు కదా కాస్త కనిపిస్తూ వుంటాడు మంచికీ చెడ్డకీనని; క్రిష్ణమూర్తి కేసు ఆయనతో కదిపించాను.

"నేను అర్జంటు పనిమీద కలకత్తా వెళ్ళిపోతున్నాను- ఇంటర్వ్యూ వాళ్ళిద్దరే కండక్ట్ చేస్తారు. సరే మీరు అంత యిదిగా చెబుతున్నారు గనక నేను వాళ్ళకిద్దరికీ విడివిడిగా చిన్న హింట్ యిస్తాను. ఆపైని అతని అదృష్టం!" అన్నారాయన.

క్రిష్ణమూర్తికి ఆ ఉద్యోగం రాలేదు

సరిగ్గా ఆ రోజుల్లోనే; ఒక కమ్మర్షియల్ బ్యాంక్ బ్రాంచికి, మేనేజరుగా నా శిష్యుడు రామబ్రహ్మం వొచ్చాడు. ఉద్యోగంలో చేరిన మూడో రోజున అతను మా యింటికొచ్చి కుశల ప్రశ్నలడుగుతున్న సమయంలో క్రిష్ణమూర్తి తన

## మేఘమాల-3

వచ్చి పలకరించిందంటే మహా చికాకు నాకు
నేను కవిత్వం రాసుకుంటున్నప్పుడు
నా ప్రతిభ తన కాపాడించుకుంటూ
ధారలో మనిద్దరం సమ ఉజ్జీలమంటుంది
నాకేమో సమాధి చెడిపోతుంది.

అసలే నాక్కోపం అబద్ధాలకోర్లంటే
నల్లంగా దట్టంగా పట్టి మెల్లిమెల్లిగా తెలిపోవడం
సూదిమొనంత సూచన లేకుండా కుంభవర్షం కురవడం
నాగ్గిట్టదు నల్లనీ తెల్లని యీ రెండునాల్కల వ్యవహారం

చచ్చే భయం దానికి మంత్రిగారి సభ చెడగొడదాం
కురవ్వే అంటే
తుర్రున ఆయన కార్లోవెళ్ళాక ప్రేక్షకుల్ని ప్రయాస
పెడుతుంది.
ఆయన తన రక్తం పంచుకొని పుట్టిన చుట్టమంటుంది

చేతనైతే నువ్వే గెరిల్లాలతో వెళ్ళి సభను చుట్టుముట్ట
మంటుంది
విసుగుపుట్టి నే నన్నాను ఒకరోజు
నువ్వు కొన్ని ఊళ్ళు కురుస్తావు కొన్నింటిలో కురవ్వు
మీరూ మీరూ ఊళ్ళు పంచుకునే దొంగలని.

తిట్టు కవిత్వం రాస్తావు నువ్వని వెక్కిరించివెళ్ళిపోతుంటే
భట్టు కవిత్వం రానివాడు ఏం జేస్తాడని బదులు చెప్పి
సాగనంపాను.

నాటి నుంచి పగే దానికి నామీదా
పల్లెలమీదా ప్రజలమీదా-
వేరే మబ్బుల విశ్వామిత్ర సృష్టికి
విశ్వప్రయత్నం చేస్తే మంచిది విజ్ఞానశాస్త్రం.

(8-10-81)

— శ్రీ త్రిశేషులు కుందుర్తి.

ఇంటర్వ్యూ ఫలితంయేమైందని కనుక్కోడానికి మా ఇంటికే వొచ్చాడు. బోలెడు సారీలు కట్టి క్రిష్ణమూర్తికి ఆ చేదునిజం తెలియజేశాను. నేను అంత మర్యాదగా చూస్తున్న మనిషికదా అని రామబ్రహ్మం ఆసక్తి చూపించి, పట్టభద్రులకి స్వయం ఉపాధి పథకాలు చాలా వున్నాయని; అలాటివాట్లో ఏదో ఒకటి చేపట్టగలిగితే తన బ్యాంక్ నుంచి రెండువేల అయిదు వందల వరకు అప్పుయివ్వొచ్చనీ ఈ వూరి బ్రాంచికి తనే యజమాని కనక "జస్ట్" గురువుగారు "మోరల్ సెక్యూరిటీ"గా ఉంటే చాలు, "ఆర్డర్" తనే యిస్తాననీ చెప్పేడు.

దాంతో,

క్రిష్ణమూర్తి వాళ్ళయింటి అరుగు మీద కిళ్ళీ దుకాణం పెట్టాడు.

బ్యాంకు వాళ్ళు ఇండెమ్నిటీ బాండుకి, నామకః తెరిచి వుంచవలసిన కరెంట్ అకౌంటుకి కొంత ఖర్చు పెట్టించినా, మిగిలిన డబ్బుతో వాళ్ళ యింటి ముందరి అరుగుమీద గోడలు అల్మారాలు నిర్మించి తలుపు లేర్పాటు చేసి పకడ్బందీగా కొట్టు కట్టాడు క్రిష్ణమూర్తి.

ఆర్నెల్లు గడిచేలోగా నేను అతన్ని చాలాసార్లు పలకరించేను; కిళ్ళీలు తీసుకుంటున్నప్పుడల్లా.

ఇవాళో, రేపో దివాలా తియ్యడం అన్నట్టే ఉండేవాడు.

"ఏం వ్యాపారం సార్, అందరూ అరువులు పట్టుకుపోతున్నారు! ఉన్న సరుకులు కొనరు. సబ్బులు తెప్పించావా, అగరొత్తుల ప్యాకెట్లు లేవా, అయ్యో తల నెప్పి మాత్రల్లేవుటోయ్ అనేస్తున్నారండి అన్నాడొకసారి; క్రిష్ణమూర్తి.

ఏ బ్యాంకాళ్ళు రెండువేల అయిదు వందలిచ్చారాండి? అందులో ఈ కొట్టు కడతాకి మునిసిపాల్టీవాళ్ళు ప్లానెప్రూవ్ చెయ్యటానికి వెందొందలు కాజేశారండి. అసలు బ్యాంకి గుమ్మం దాటేలోపుగానే దావాపు నూటిరవై రూపాయలై పోయాయండి. ఆ తరువాయిత ఇక్కడగోడల్లేపటానికైతేనేం. తలుపులూ అల్మేరాలూ అయితేనేం రోడ్డుమీదికి మెట్లయితేనేం పన్నెండు వొందలై పోయాయండి. సర్లే కలపతో బడ్డీ కట్టించినా పదిహేను వందలై పోతా యనుకోండి. అదిగాదు నేననేదండి. ఆ రెండువేలనాలుగొందలూ దీనిమీద బెట్టానుగానండీ దీనికి బదులు అదే సొమ్ము గుప్‌చిప్‌గా ఎవరిచేతుల్లోనైనా పడేస్తే ఉద్యోగమే వొచ్చేది గదంటండి?" అన్నాడు క్రిష్ణమూర్తి యింకోసారి.

నాకు ట్రాన్స్‌ఫర్ అయినప్పుడు క్రిష్ణమూర్తితో చెప్పకుండా తిన్నగా బ్యాంక్ కెళ్ళి రామబ్రహ్మన్ని కలిశాను. "క్రిష్ణమూర్తి తరుపున హామీ వున్నాను కదా; అతను నేడోరేపో కొట్టు ఎత్తేసేటట్టున్నాడు. కొంపదీసి నా పీకల మీదికి రాదుగదా" అని రహస్యంగా అడిగాను.

రామబ్రహ్మం లెడ్జర్ తెప్పించి చూశాడు.

దుకాణం తెరిచిన నాలుగు నెలల వరకు అకౌంట్‌లో జమ అసలు లేదు, (వడ్డీకూడాలేదు)

అయిదో నెలనుంచి; నెలకెంతకట్టాలో అంతకి ఒకటిన్నర రెట్ల చొప్పున జమ పడింది. అలా నాలుగు నెలలు పడింది. మళ్ళీ గైర్‌హాజరు. అలా మూడునెలలు. మళ్ళా పదో నెలలో నాలుగు వాయిదాల మొత్తం చెల్లు.

"ఈ లెక్కని అతనేమీ దివాలా

తియ్యడు మేష్టారూ. అయినా అతగాడికి స్వంత యిల్లు వుంది. మరేం భయంలేదు; మీరు నిశ్చింతగా వెళ్ళిపోండి" అన్నాడు రామబ్రహ్మం.

అంతే. క్రిష్ణమూర్తిని మరిచిపోయాను.

ఇప్పుడు—

ఈ నగరానికంతటికీ నాడీకేంద్రం లాంటి ఈ సెవెంటీ ఎం.ఎం. థియేటర్ జంక్షన్‌లో సరిగ్గా థియేటర్ కెదురుగా క్రిష్ణమూర్తి కిళ్ళీకొట్టు!

షేక్‌హాండు అయినాక వెంటనే క్రిష్ణమూర్తి కిళ్ళీకొట్టు మీదనుంచి మేనల్లుణ్ణి దింపేశాడు.

తనే అధిష్ఠించాడు ఆ సింహాసనం.

అప్పటికే నాకు చేతికందిపోయిన జర్దాకిళ్ళీల విశేషం అడిగి తెలుసుకుని "నా చేత్తో రెండు కిళ్ళీలు కట్టి ఇస్తాను గురూగారూ" అని ముచ్చటపడ్డాను.

పళ్ళెంలో తడిగుడ్డ కింద వుంచిన బెంగాలీ తమలపాకుల్ని ఓసారినిర్లక్ష్యంగా తిరగేసి వదిలేసి దిగువన బుట్టలోంచి మర్రి ఆకులంతేసి పరిమాణం దళసరీ వున్నవి లాగాడు.వాటిని చక్కగా శ్రద్ధగా కడిగాడు.

సున్నం రాస్తూ
కవిరి (కాచు) పూస్తూ
ఖిమాం తగిలిస్తూ
జర్దా వేస్తూ
పచ్చివక్క
ఉప్పుచెక్క
యాలక్కాయి
పిప్పరిమెంటూ తగిలిస్తూ చెప్పాడు విశేషాలు.


ఆ కిళ్ళీ దుకాణం విలువ యెంత లేదన్నా నలభై వేలుంటుందిట ఇవాళ.

సెంటర్లో పెట్టినందుకు 'పగిడీ'లాంటి ముడుపు పదివేల రూపాయలు.

కొట్లోవున్న విలువెత్తు ఫ్రిజిడేర్ ఏడు వేలు.

ఇంక అక్కడి సరుకో?
అది కిళ్ళీ కొట్టేనా అంటే
అవునంటే అవును.
కాదంటే కాదు కూడాను.

సబ్బులు, దువ్వెనలు, హేరాయిల్సు, షాంపూలు.



టూత్‌పేస్టులు, బ్రష్షులు,నాలికబద్దలు.

బ్లేడులూ, రేజర్లు,లోషన్లు,ఆ బ్రషులు.

పేకదస్తాలు,జేబురుమాళ్ళు,బట్టలారేసుకునే హాంగర్లు,కిప్పులు,రబ్బరుబ్యాండ్సు, జెడపిన్నులు, రిబ్బన్లు.

కాఫీపొడి, టీ పొడి పొట్లాలూ,బోర్న్‌విటా డబ్బాలు రీఫిల్సు, బూస్టులాంటి ఇతర పొడులు పాలపొడి డబ్బాలు.

సిగరెట్లు విదేశీ స్వదేశీ అనే విచక్షణ లేకుండా కొన్ని డజన్ల రకాలు. చుట్టలూ, బీడీలూ పొగాకు—

సూదులు, దారాలు,గుండీలు,జిప్పులు.

దోమల్ని తరిమేసే కొత్తరకం సర్పాకృతి అగరొత్తి చుట్టలు.

సోడాలూ, అరటిపళ్ళూ డ్రింకులు.

ఈ పక్కగా వేళ్ళాడుతూ సీమటపాకాయ గుత్తుల్లా రకరకాల రంగురంగుల వివిధ భాషల వార్తాపత్రికలూ, వారపత్రికలూ, మాసపత్రికలూ.

ఆ లోపల ఫ్రిజిడేర్ నెత్తిమీద కూర్చుని మరిన్నిరకాలపుస్తకాలదొంతర్లు

నోట్ పుస్తకాలూ, పెన్సిళ్ళూ, బాల్‌పాయింట్ పెన్నులూ వాటి రీఫిల్సు,టార్చిలైట్‌లకి, రేడియోలకి వాడే బ్యాటరీలు.

అగరొత్తులూ, ఫేస్ పౌడర్లు, సెంట్లూ.

ఎదురుగా సినీమా హాలు ఉండడం చేత తప్పనిసరిగా అవసరం వొచ్చే తలనెప్పి మాత్రలు.

అక్కడ లేని వస్తువు సూపర్‌బజార్లో కూడా వుండదన్నాడు.

"పోన్లే. నే ననుకున్నదానికంటే యెక్కువగానే బాగుపడ్డావు. అదే సంతోషం నాకు" అన్నాను.

అతను నా కోసం ప్రత్యేక శ్రద్ధతో కట్టిన కిళ్ళీ లిస్తూ "అమజ్జ తమ ఆఫీస్ కొచ్చేనండి. ఇక్కణ్నుంచి ట్రాన్స్‌ఫరై పోయారన్నారండి" అన్నాడు క్రిష్ణమూర్తి.

మళ్ళా జేబులోంచి డబ్బులుతీసి ఇవ్వబోయాను.

"మంచారే. ఉంచండుంచండి" అని నన్ను కసిరినంత పనిచేశాడు."రే కామేశా ఇందాక అయ్యగారిదగ్గిర డబ్బులుచ్చుకున్నావా?" అని మేనల్లుణ్ణి కసిరాడు.

"మరే మామయ్యా రెండ్రూపాయలిచ్చారు."

ఆ రెండు రూపాయలు కూడా ఇచ్చేశాడు క్రిష్ణమూర్తి.

"కాని ఇన్ని వందలవస్తువులుపెట్టావు చూసుకోడంకాసుకోడం కష్టమేమోకదూ?" అన్నాను.

"తప్పదండి. ఇందులో పోటీఅల్లాంటిదండి"అన్నాడు క్రిష్ణమూర్తి."మనూళ్ళో సుమారు ఎనిమిది వందల కిళ్ళీకొట్లుంటాయండివ్వాళ. అందులో ఐదు వందల్లాకా ఇదే పద్ధతండి. ఈ పద్ధతిలో వున్న కొట్లేవీ కూడా మన తెలుగోళ్ళవి కావండి. ఈ మలయాళీ కొట్లపద్ధతి చూసి నేర్చుకోకపోతే యాపారం పాపాయిలా గుండిపోద్దండి. ఇంకా అళ్ళైయితే కిళ్ళీకొట్టానుకుని టీ కొట్లు కూడా పెట్టేసి దాంటోబన్నులు బ్రెడ్డుబిస్కెట్లు కేకులు పకోడీలు సమోసాలు మసాలగార్లు అమ్మేస్తున్నారండి-కాఫీలు టీలు బోర్నవిటాల్తో సయితంగా. అళ్ళండి; పుదయం ఐదున్నరకి కొట్టిప్పుతారండి. రాత్రి పదిన్నర దాట్నాక పోలీసోడు అల్లంతదూరాన్ని కనబడేవరకు అలా కూర్చుని అమ్ముతానే వుంటారండి. కూర్చోటానికి ఇసుగ్గైతే నుంచుటారంతేగాని కొట్టు దిగి బేటికెళ్ళరండి. ఇంకా అది పట్టుబడక నేను మా మేనల్లుణ్ణి రప్పించానండి. ఈడికి పద్దేనిమిదేళ్ళు లేవండి. కాని నెలకి వంద యాభై జీతమిచ్చి తిండెడతన్నానండి."

## మేఘమాల-4

క్రొండెక్కి ఒక మబ్బు కోతిలా పండ్లికిలించింది
నన్ను చూసి నా కవిత్వం చూసి
అంత అడుగు పొరల్లో కూరుకుపోయిన వాడివి
నన్నేం జేస్తావు నీవన్న ధీమాతో.

ఆకాశభాషలో వానాకాలపు చదువులు చదివిన దానికి
తెనుగువాడి నుదికారం తెలీకపోవచ్చు అక్షరాల్తో అని
కావ్యార్తి చేత్తో పట్టుకుని వెలిగించి ఎత్తి చూపించాను
మార్పుమాత పెట్టబోతున్న మంటలకు చిన్నచిహ్నంగా
కూడా

అవసానదశలో గుట్టపడిన అపకీర్తి అని తెలీదు దానికి
తన ఒంటినిండా పులుముకున్న తారులాంటి నలుపు
ఆకాశంలో అక్కడక్కడ కనిపిస్తున్న ఎర్రటి సన్నని
మబ్బులు

పీడితుల కోపాగ్ని జ్వాలలు పెట్టుకున్న విప్లవసంఘాలని
తేలేదు దానికి తన వెనుక సూర్యుడు దాక్కున్నది
తాత్కాలికమని
అందరితోపాటు ఆయన వెలుగు అడుగు పొదలమీద
పడుతుందని
మరికొంత సేపట్లో తాను నీరుగారిపోయిన తర్వాత
ఆకాశం నిర్మలంగా వుంటుందని
సమాజం తెల్లగా మారుతుందని
వెలుగు గాలిలా నలువైపులా వీస్తుందని
జరిగిందంతా తప్పని చరిత్ర రాస్తుందని
సూర్యుడే నింగికి నిజమైన రాజని
ఆదే లోకానికి మంచిరోజని.

(16-10-81)

—శ్రీ త్రిశేషులు కుందుర్తి.

రకరకాల వాళ్ళతో ఆత్మీయంగా మాట్లాడడంకోసం కాబోలు, క్రిష్ణమూర్తి భాషకూడా మార్చేసుకున్నాడు. లోగడ ఈ రకం యాసలేనట్టే నాకు జ్ఞాపకం.

"మీ తమ్ముడుండాలి కదా" అన్నాను.

"ఆడు ఇంటి దగ్గర పెట్టిన దుకాణం చూస్తున్నాడండి. ఒక ఆటో కొనుక్కుని వెనక్కాల కేరియర్ పెట్టామండి. ఉదయాన్నె ఐస్ ఫ్యాక్టరీకెళ్ళి ఐస్ తెచ్చి నలభై కొట్లలో యేసేత్తాడండి మాతో పాటున్ను. అలా మూడుసార్లు తిరుగుతాడండి."

"మరి అతనలా తిరుగుతున్నప్పుడు ఆ దుకాణం ఎవరు చూస్తారు?"

"మా చెల్లెలుంది కదండి; కాసేపు కొట్టుమీద కాసేపు మిషనుమీద కూర్చుంటాదండి."

"కుట్టు మిషనా?"

"కుట్టుమిషన్ మాయావిడదండి. మా చెల్లెమ్మ పైపు హయ్యర్ పేసయింది కదండి. మా యిల్లేమో జిల్లాకోర్టు ఎదట గదండి; అర్జంటుగా టైపుగావల్సిన కాగితాలు అలా వొచ్చిపడ్తా వుంటాయండి.

ఇలా అన్నీ చెబుతూనే కొట్టు మూసేశాడు క్రిష్ణమూర్తి మేనల్లుడి సహాయంతో. తాళాలన్నీ స్వయంగాలాగి చూసుకుని "పదండి" అన్నాడు. "అన్నట్టు ఇప్పుడెక్కడండి, మనిల్లండి?"

"అబ్బో. సీతమ్మధార కొండవాడ్దునయ్య."

"టి. పి. టి. స్థలంకొని కట్టించారండి?"

"లేదయ్యా బాబూ క్వార్టర్సు!"

"అయి బాబోయి ఇంతరాత్రప్పుడు ఎలా గెల్తారండి! ఉండండి నేను డ్రాప్ చేస్తాను." అని కిళ్ళికొట్టు పక్క సందులోంచి ఒక స్కూటర్ తెచ్చాడు. "ఒరే కామేశ! నువ్వింటికెళిపో. నేనొక అరగంటలో గురువుగార్ని దిగబెట్టొచ్చేస్తా".

"స్కూటర్ కూడాకొన్నావన్న మాట".

"తమ దయవల్ల అన్నీ కొన్నానండి. మంచివి రెండు ఇళ్ళస్థలాలుకూడా సంపాదించేనండి. ఈ యేడాది అవి రెండు అమ్మేసి కార్పొరేషన్ వాళ్ళ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఒకదాంట్లో డిపార్ట్‌మెంటల్ స్టోర్స్ తెరుద్దామనుకుంటున్నానండి."

మా క్వార్టర్సు గగ్గిర నన్ను దింపేస్తూ అడిగాడు "ఇంకా తమకెంత సర్వీసుందండి మాస్టారు?"

"ఎంతో యెక్కడుంది నాయనా? మామూలుగా అయితే ఇంకా రెండేళ్ళుండేదే. కాని మొన్న జీ.వో. వొచ్చిందిగా. ఈ నెలాఖర్న రిటైర్ కావల్సిందే. అంటే ఇంకో ఆరురోజులున్నట్టు లెక్క! ... అది సరేగాని. ఈ రిటైర్మెంట్ అయిపోతే కొన్నాళ్ళపాటు ఏదైనా పని దొరికితే చెయ్యాలనుందయ్యా.... అంటున్నాననుకో- ఆనాడు నాచుట్టూ రాత్రీపగలూ తిరిగావు, ఉద్యోగంకోసం. నేను ఇప్పించలేకపోయాను. అదంతా మనసులో పెట్టుకోక నాకిప్పుడు ఎక్కడైనా చిన్న ఉద్యోగం చూపిద్దూ. నీకు పుణ్యముంటుంది!"

"ఎంతమాటన్నారు మాష్టారు. మీరు నాకు ఉద్యోగం యిప్పించుంటే నేనాక్కడ్నే ఈసురోమంటూ నెలజీతం తెచ్చుకుండేవాణ్ణి" మరి ఆనాడు నన్ను వ్యాపారంలో పెట్టాకి మాత్రం మీరే గదేటి, ఆదారం సూపించింది?"

"సరేలే మంచివాడివి కనక గుర్తుంచుకున్నావు. మరి నామాటేం జేస్తావు?" అని నిలదీసేను; క్రిష్ణమూర్తి బుజం మీద చెయ్యేసి.

"ఇరయెనిముదోతేదీ గదండిమాస్టారూ తమ రిటైర్మెంటు? ఫస్టు తారీకుని కనిపిచ్చండి. తమకి ఏదో చేస్తాను. గాడ్ ప్రామిస్" అని స్కూటర్ కిక్ కొట్టాడు కిళ్ళి కొట్టు క్రిష్ణమూర్తి.